స్కెచ్

# చిలుక జయించిన పంజరం

అంగర సూర్యారావు

ఆడపిల్లల్ని కన్నతండ్రులు మాత్రమే తమ పిల్లలు చెడ్డవాళ్ళన్న పేరు ఎక్కడవస్తుందో నని జడుస్తూ వుంటారు. అలాగే మాధవరావు కూడా జడిశాడు. ఆయనపిల్లలు చెడ్డవాళ్ళన్న పేరు ఎలాగూవచ్చింది.

ఆడపిల్లల్ని చదివించకూడదని పోరు పెట్టి పోరు పెట్టి మాధవరావు భార్య చచ్చిపోయింది. కనీసం భార్య ఆత్మశాంతికోసమైనా మాధవ రావు తన కూతుళ్ళను చదివించడం మానలేదు.

ఆయన పెద్దకూతురు శకుంతల ఇంటర్మీడి యట్ చదువుతూ ఎవరో గుణవంతుడిని చూసు కొని లేచిపోయింది. మాధవరావు కూతుళ్ళు చెడ్డవాళ్ళనడానికి లోకానికి యింతకంటే మంచి నిదర్శనం ఏం కావాలి? కూతురు లేచిపోయినా చదువువల్ల ఆడపిల్లలు చెడిపోతారన్న సిద్ధాం తాన్ని మాధవరావు ఒప్పుకోలేదు. మగవాళ్ళల్లో దుర్బలహృదయులు ఎలా వున్నారో ఆడ వాళ్ళలోకూడా అలాగే వుంటారు. వాళ్ళు చెడి పోతారు. అంతేకాని వాళ్ళు చెడిపోవడానికి చదువు ఎంతమాత్రం కారణంకాదని మాధవరావు వాదం.

మాధవరావుగారి రెండో అమ్మాయి సుధకి ఆయన సిద్ధాంతాలన్నీ బాగా పట్టుబడినై. ఎవరైనా చదువుకున్న పిల్లలు చెడిపోతారని అంటే వాళ్ళతో వాదించి పోట్లాడి మరీవచ్చేది. ఆమె పేరులోవున్న సుధ మాటల్లో ఎంతమాత్రం కనిపించదు.

సుధ అక్క శకుంతల చదువుతూ చెడిపో యింది గనక సుధకూడా అంతే అవుతుందని లోకం దృఢవిశ్వాసం. సుధ రెండు జడలు వేసుకుంటుంది. టాయిలెటువుతుంది. శుభ్రమైన బట్టలు కడుతుంది. దారినిపోయేప్పుడు మగాళ్ళు చూస్తే సిగ్గుపడదు. పైగా వాళ్ళకేసే చూస్తుంది. యివన్నీ చెడిపోయేవాళ్ళ లక్షణాలు కాకపోతే మరేమిటి?

సుధ స్కూలుఫైనల్ చదివే రోజుల్లో ఒక పెళ్ళిసంబంధం వచ్చింది. పెళ్ళికూతురు చదువు కుంటున్నదని తెలిసేసరికి—కలరా తగిలినమనిషి సమీపానికి రావడానికి జంకినట్లు పెళ్ళివారు వెళ్ళిపోయారు.

మాధవరావుకు యిప్పుడు మిగిలిన ఒక కూతు రుకూ పెళ్లి కాదేమోనని భయం పట్టుకుంది. ఆయ నకు వచ్చిన ప్రావిడెంటుఫండంతా భార్య రోగా నికి, కూతుళ్ల చదువుకూ ఖర్చయిపోయింది. యిక వస్తున్న 60 రూపాయల పెన్షనుతో మాత్రమే కుటుంబనిర్వహణ జరగాలి. యింతవరకూ దర్జాగా బతికిన కుటుంబంగనక ఆ డబ్బు ఏమూలకూ రావ డంలేదు. రహస్యంగా కొన్ని యిబ్బందులుకూడా పడవలసివచ్చింది. ఈ సమయంలో సుధ స్కూలు ఫైనల్ పాసయ్యింది.

సుధ కుటుంబ పరిస్థితుల్ని అర్థం చేసుకుంది. పైచదువులకోసం పట్టు పట్టలేదు. ఒకనాడు వాళ్ల నాన్నగారితో అంది.

"ఎకౌంట్సు ఆఫీసులో ఉద్యోగానికి అప్లికే షన్ పెట్టాను. వచ్చింది. రేపటినుంచి ఉద్యో గానికి వెడతాను."

మాధవరావు యింతవరకూ స్త్రీలకు ఉన్నత విద్య అవసరమా కాదా అన్నవిషయం మీద పరిశోధనలు జరిపేడు. కాని స్త్రీలు ఉద్యోగాలు చెయ్యవచ్చునా కూడదా అన్నసమస్య గురించి ఆలోచించలేదు. కనక ఆయన వెంటనే ఏమి చెప్పలేకపోయాడు. సుధ ఉద్యోగంలోచేరి పని చేస్తూవున్నా ఆయన యింకా ఆ సమస్యమీద ఆలోచిస్తూనేవున్నాడు.

సుధ పనిచేస్తున్న ఆఫీసులో కొత్తగా ఒకఅ సిస్టెంటు ఆఫీసర్ని ఒకరిని వేశారు. ఆయన యువ కుడు. తెల్లగా, పొడుగ్గా, హుషారుగావుంటాడు. పేరు గోపాలరావు. ఏవూరినుంచి వచ్చాడో ఎవ రికీ తెలీదు. ప్రతిగుమాస్తాతోను బంట్రోతుతోను కూడా మర్యాదగా మాట్లాడతాడు. అందుకే అ

నికి స్వల్పకాలంలోనే మంచిపేరువచ్చింది. ఆయన ఒకనాడు ఆఫీసులో ప్రసంగవశాత్తు "స్త్రీలకు ఉన్నత విద్య మంచిదికాదు. అది నాకు యిష్టం లేదు" అన్నాడు.

ఆఫీసర్ని "ప్లీజ్" చెయ్యడమే తమ పనిగా పెట్టుకున్న గుమాస్తాలంతా "నిజం నిజం" అన్నట్లు తలలూపారు-యింతలో "మీ ఉద్దేశం తప్పు" అన్నమాటలు పంచమస్వరంలో వినిపించినై. అందరూ ఆశ్చర్యంతో వెనక్కి తిరిగి చూశారు. సుధ తన సీటులోంచి లేచినుంచుని వుంది. కోపంతో ఆమె ముఖం జేవురించింది.

"మీరు ఉన్నత విద్య చదివిన స్త్రీగనక నా మాటలకు మీకు కోపంరావచ్చు. నేనీ విషయం బాగా ఆలోచించే స్త్రీకి ఉన్నతవిద్య పనికిరాదనే ఉద్దేశానికి వచ్చాను. మీరు సాయంత్రం ఆఫీసు మూసిన తరవాత నాకు కనిపించిరారంటే యీ విషయం గురించి తాపీగా చర్చించవచ్చు. స్త్రీకి ఉన్నత విద్య పనికిరాదని మీచేతే ఒప్పిస్తాను" అన్నాడు గోపాలం నవ్వుతూ.

"స్త్రీకి ఉన్నతవిద్య అవసరంకాదని మీరు నాచేత ఎప్పుడూ అనిపించలేరు. స్త్రీకి విద్య అవసరమని నేనే మీచేత ఒప్పించగలను" అంది సుధ కోపంతో.

సాయంత్రం ఆఫీసు టైం అయిపోగానే సుధ గోపాలం ఆఫీసు గార్డెన్‌లో కూర్చున్నారు. బంట్రోతు రెండు కప్పులతో కాఫీ తీసుకువచ్చి బల్లమీద పెట్టాడు. గోపాలం కాఫీ తాగుతూ "నా ఉద్దేశం ఏవిధంగా తప్పో చెప్పండి!" అన్నాడు.

"మన సమాజంలో మొదటినుంచి డబ్బున్నవాడు దరిద్రుడినీ, పైకులంవాడు కిందకులంవాడినీ, పురుషుడు స్త్రీనీ అణగద్రొక్కుతూ వచ్చారు. చదువుకుంటే తమ ఆటలు సాగనివ్వకుండా ఎక్కడ తిరగబడుతుందోనని స్వార్థంతో స్త్రీకి చదువు పనికిరాదంటాడు మొగవాడు" అంది సుధ.

"స్త్రీకి చదువు పనికిరాదనడానికి కారణం అదికాదు. స్త్రీల మనసు చాలా సున్నితమైనది. ప్రతి చిన్న విషయానికి ఆమె మనసు చలిస్తుంది. పురుషుడితో సరిసమానంగా చదివి తిరిగితే మానసిక దౌర్బల్యంవల్ల యిట్టే చెడిపోతుంది. ఈ ఉద్దేశంతోనే స్త్రీకి చదువు పనికిరాదన్నారు కాని స్వార్థబుద్ధితో మాత్రం కాదు" అన్నాడు గోపాలం.

గోపాలం వాదన వినగానే సుధకు మరింత కోపంవచ్చింది. ఆమె కోపంతో "మీవి పూర్తిగా ముసలి ఉద్దేశాలు. మగవాళ్ళకంటే ఆడవాళ్ళలోనే మానసిక దారుఢ్యం వున్నవాళ్లు ఎక్కువ మంది వున్నారు. ఈనాడు స్త్రీ విమానాన్ని నడుపుతోంది-మగవాడికంటేసామర్థ్యంతోమంత్రి పదవిని నిర్వహిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే స్త్రీ చెయ్యలేని పనేదీ లేదు. మీలాంటి యువకవృద్ధులు వుండబట్టే ఈ శతాబ్దంలోకూడా ఈ దేశంలో ఆడవాళ్లు వెనకబడివున్నారు" అంది.

"ఉన్నతవిద్య చదివి చెడిపోయిన స్త్రీలా నెందరినో నేనెర్గుగుదును. వాళ్ళని తలుచుకుంటూ వుంటే నాకెంతో విచారం కలుగుతోంది."

"మీరు లోకంలో చెడ్డనే ఎందుకు చూడాలి? బాగా చదువుకొని ఉన్నతదశలోకి వచ్చిన స్త్రీలనుచూసి సంతోషించండి."

చివరకు సమస్య తెగలేదు. మీ ఉద్దేశం తప్పంటే మీ ఉద్దేశం తప్పని యిద్దరూ రాత్రి ఏడు గంటలవరకూ వాదించుకొని వెళ్ళిపోయారు.

మర్నాడు ఉదయం ఆఫీసరుగారు సుధ టేబిలు ముందునుంచి వెడుతూవుంటే సుధ ఆయనకేసి చురచురా చూసింది. ఆయనకూడా సుధవైపు సీరియస్‌గా చూసి తన గదిలోకి వెళ్ళిపోయాడు. వీళ్ళ ఆదర్శాల యుద్ధంలో ఎవరు గెలుస్తారో ఆఫీసువాళ్ళెవరూ వూహించలేకపోయారు.

వారంరోజులు గడిచాయి. సుధ తన ఉద్యోగానికి రాజీనామా యిచ్చింది. తన ఆదర్శంకోసం ఆఫీసరుతోపోట్లాడి ఉద్యోగాన్నికూడా త్యాగం చేసినందుకు ఆఫీసువాళ్ళంతా సుధను మెచ్చుకున్నారు.

కాని ఆ మర్నాడే గోపాలం సుధా రిజిస్టరు మేరేజి చేసుకున్నారన్న వార్త విని ఆశ్చర్యచకితులయ్యారు.

స్త్రీలు ఉద్యోగాలు చెయ్యవచ్చా కూడదా అన్న సమస్యమీద మాధవరావు యింకా పరిశోధనలు చేస్తూనేవున్నాడు.